
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



3

జయశంకర్ భూపాలపల్లి

ములుగు

సోమవారం 8 ఏప్రిల్ 2024

రంజాన్ వేళలు


ఇఫ్తార్ : సోమవారం సా : 6.36 గం.

సహర్ : మంగళవారం ఉ : 4.42 గం.

దేవుడి సొమ్ముకు ఎసరు

ఏటీఎంలుగా మారిన దేవాలయాల ఆదాయం

- అవసరం లేకున్నా.. అనవసర వినియోగం
- ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే రూ.3కోట్లు వాడకం
- తాజాగా మరో రూ.50లక్షలకు టెండరు
- భక్తుల సౌకర్యాలు గాలికొదిలి సొంత ఖర్చులకే పెద్ద పీట
- దేవాదాయల శాఖలో ఓ అధికారి ఇష్టారాజ్యం



ఆలయాల భూములు ఒక వైపు ఆక్రమణదారుల కబ్జాలకు బలవుతుంటే.. మరోవైపు ఆలయాల ఆదాయం అధికారుల పాలవుతున్నది. ఆలయాల ఆదాయాన్ని వాటి అభివృద్ధికి, భక్తుల సౌకర్యాల కల్పనకు ఖర్చు చేయాలి. కానీ దేవాదాయశాఖలోని కొందరు అధికారులు తమ సొంత విలాసాలకు వాడుకుంటున్నారు. ప్రతీ జిల్లాలో ఒకటీ రెండు ప్రధాన దేవాలయాలను వారు ఏటీఎం కార్డుల్లా వినియోగించుకుంటున్నారు. ఆదాయం కలిగిన ఆలయాలపై కన్నేస్తున్నారు. వాటి నుంచి ఎప్పుడు పడితే అప్పుడు.. ఎంత పడితే అంత.. అవసరం ఉన్నా.. లేకున్నా.. తమ సొంత సొమ్ములాగా వాడేసుకుంటున్నారు. ఆఫీసు భవనాల నిర్మాణానికో, లేదా అందులో విలాసవంతమైన ఫర్నిచర్ కోసమనో ఎడాపెడా తీసేకుంటున్నారు. తాజాగా మడికొండలోని సుప్రసిద్ధ మెట్టు రామలింగేశ్వరాయం ఆదాయం నుంచి రూ.50లక్షలకు ఎసరు పెట్టారు. ఇప్పటికే నగరంలోని మూడు ప్రధాన ఆలయాల ఆదాయం నుంచి రూ.3.30 కోట్లను వాడేసుకున్నారు.

హనుమకొండ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలోని పాత సెంట్రల్ జైలుకు ఎదురుగా ఇటీవల నిర్మించిన ధార్మిక భవన్‌పై మరో అంతస్థు నిర్మాణం పేరుతో మడికొండలోని చారిత్రకంగా సుప్రసిద్ధమైన మెట్టు రామలింగేశ్వరాలయం ఆదాయం నుంచి రూ.50లక్షలను దేవాదాయ శాఖ అధికారులు మంజూరు చేయించుకున్నారు. ఇందుకు ఎక్స్‌టెన్షన్ పేరుతో చాలాకాలంగా దేవాదాయశాఖలో పాతుకు పోయి ఇటీవల బలవంతంగా బయటకు పంపివేయబడిన ఓ ఉన్నతాధికారి సహకారం ఉన్నట్టు తెలుస్తోంది. కేసీఆర్ కుటుంబసభ్యులకు అత్యంత సన్నిహితుడైన దేవాదాయ శాఖ ఉన్నతాధికారి.. తన పలుకుబడిని ఉపయోగించి ఆలయాల ఆదాయం నుంచి ఇష్టారాజ్యంగా నిధులను వాడుకుంటుంటున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. తాజాగా మెట్టుగుట్ట గుడి నుంచి తీసుకున్న రూ.50 లక్షలతో పాటు భద్రకాళి గుడి, సమ్మక్క - సారలమ్మ జాతర నుంచి కూడా రూ.50 లక్షల చొప్పున మరో రూ.కోటి తీసుకునేందుకు కూడా అధికారులు ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ రెండు గుళ్ల నుంచి ఈ మొత్తాన్ని కూడా ఏదోరోజు లాగేసుకునే అవకాశాలు లేకపోలేదు. ఈ భవనం నిర్మాణానికి ఇప్ప టికే ఈ మెట్టు రామలింగేశ్వరాలయం నుంచి రూ.కోటి, వరంగల్ భద్రకాళి గుడి నుంచి రూ.కోటి, సమ్మక్క - సారలమ్మ జాతర నుంచి రూ.కోటి తీసుకొని ఖర్చు చేశారు. ఇంతటితోనే సరిపెట్టుకోకుండా ఇటీవల ఈ ధార్మిక భవన్‌లో ఫర్నిచర్ కోసమని ఈ మూడు దేవాలయాల నుంచి రూ.10 లక్షల చొప్పున మరో రూ.30లక్షలను వాడుకున్నారు. ఒక్క సారిగా ఈ మొ త్తం తీసుకుంటే భక్తుల నుంచి ఆగ్రహం చవిచూడాల్సి వస్తుందని అధికారులు వ్యూహాత్మకంగా విడతల వారిగా తీసుకుంటున్నారు. అది కూడా గుట్టు చప్పుడు కాకుండా వాడుకుంటున్నారు.

భక్తులను విస్మరించి..

నిజానికి భక్తులు కానుకల రూపంలో ఆలయాలకు సమకూరే ఆదాయాన్ని వాటికి అభివృద్ధి, భక్తుల సౌకర్యాల కోసం ఖర్చు చేయాలి. కానీ దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు ఇందుకు భిన్నంగా తమ విలాసాల కోసం దేవుడి సొమ్మును ఇలా ఫలహారం చేస్తున్నారు. ఆఫీసు భవనాలు, అందులో ఫర్నిచర్, ఇతర వసతుల కోసం రాష్ట్రప్రభుత్వం ఇచ్చే నిధులను వినియోగించాలి. ఇందుకు అవసరమైన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపాలి. ఆమోదం పొందిన తర్వాత నిధులు మంజూరు చేయించుకునేందుకు ప్రయత్నించాలి. కానీ ఉమ్మడి వరంగల్ జిల్లాలోని దేవాదాయశాఖ అధికారులు ఇవేవీ చేయకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. ఆదాయం కలిగిన దేవాలయాలు వారికి ఏటీఎంలా కనిపిస్తున్నాయి. వాటి ఆదాయాన్ని ఇష్టం వచ్చినట్టు వాడుకుంటున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మెట్టుగుట్ట గుడిపై కన్ను

కాజీపేట శివారులోని ఆయోధ్యపురంలో రైల్వేశాఖ ఓవర్ హాలింగ్ వ్యాగన్ వర్క్‌షాపు నిర్మాణానికి సేకరిం చిన 120 ఎకరాల స్థలానికిగాను పరిహారంగా సుమారు రూ.60 కోట్లను చెల్లించింది. ఆ డబ్బు ఆలయం పేర బ్యాంకులో జమ అయి ఉంది. దీనిపై గతంలోనే బీఆర్ఎస్ ప్రభుత్వంలోని దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి కన్నేశారు. తన నియోజకవర్గంలో దుర్గగుడి నిర్మాణానికి రూ.3కోట్ల నుంచి ఇందులోంచి తీసుకునేందుకు ప్రయత్నించారు. భక్తుల నుంచి తీవ్రస్థాయిలో నిరసన వెల్లువెత్తడంతో ఆయన ఆ ప్రయత్నాన్ని విరమించుకు న్నారు. ఆతర్వాత ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన దేవా దాయ శాఖ అధికారుల కన్ను ఈ గుడిపై పడింది. దీనితో తమ కార్యాలయాల కోసం ధార్మిక భవనం నిర్మించు కునేందుకు ఈ గుడి నుంచి రూ.కోటితోపాటు భద్రకాళి, సమ్మక్క-సారలమ్మ జాతర దేవస్థానం నుంచి రూ.కోటి చొప్పున మొత్తం రూ.3కోట్లను గుట్టుచప్పుడు కాకుండా లాగే సుకున్నారు. ఇంతటితో సరిపెట్టుకోకుండా ఈ గుళ్ల నుంచి కేవలం ఫర్నిచర్ కోసం మరో రూ.30 లక్షలను వాడుకున్నారు.

ఫర్నిచర్‌కు రూ.30లక్షలా?

దేవాదాయ శాఖ కార్యాలయాల్లో ఫర్నిచర్ కోసం రూ.30లక్షలు ఖర్చు చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు తమ విలాసాల కోసం ఇంతపెద్ద మొత్తం డబ్బును వెచ్చించి ఫర్నిచర్ కొనడంపై భక్తుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే గతంలో భద్రకాళి దేవాలయం దేవాదాయశాఖ కార్యాలయం ఉన్నప్పుడు అందులో రూ.10లక్షలకుపై ఖర్చు చేసి ఫర్నిచర్‌ను కొనుగోలు చేశారు. ఆ తర్వాత అక్కడి నుంచి ఈ కార్యాలయాన్ని వేరే చోటికి మార్చేప్పుడు ఈ ఫర్నిచర్‌ను కూడా తరలించారు. ఆ ఫర్నిచర్ అంతా ఏమైంది? ఇప్పుడు కొత్తగా నిర్మించిన ధార్మిక భవనంలో మరో రూ.30లక్షలతో విలాసవంతమైన ఫర్నిచర్‌ను కొనుగోలు చేశారు. పాత ఫర్నిచర్ ఏమైంది? ఏ అధికారుల ఇళ్లకు వెళ్లింది బయటపడాలంటే విచారణ జరపాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.



అశ్రునయనాల మధ్య

మావోయిస్ట్ నేత అంత్యక్రియలు

హాజరైన ఏబీఎంఎస్, పౌరహక్కులు, విరసం, ప్రజాఫ్రంట్ నేతలు



శవయాత్రలో గ్రామస్థులు, ఉద్యమకారులు.. రోదిస్తున్న సంతోష్ తల్లిదండ్రులు

కాటారం, ఏప్రిల్ 7: తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు పూజార్ కాంకేర్ అడవుల్లోని కరిగుట్ట వద్ద శనివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మావోయిస్ట్ పార్టీ దండకారణ్య తెలంగాణ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడుఅన్నె సంతోష్ అలియాస్ సాగర్ అంత్యక్రియలు భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని స్వగ్రామం దస్తగిరిపల్లిలో అశ్రునయనాల మధ్య ఆదివారం రాత్రి జరిగాయి. వందలాది మంది స్థానికులు, మాజీ మావోయిస్టులు, ఉద్యమకారులు, మావోయిస్ట్ బంధుమిత్రుల కమిటీ సభ్యులు, కళాకారులు హాజరై ఉద్వేగభరిత వాతావరణంలో అంతిమయాత్ర నిర్వహించారు.

సంతోష్ మృతిని పోలీసులు మొదట ధ్రువీకరించలేదు. ఎన్‌కౌంటర్ మృతుల వివరాలను మావోయిస్ట్ నేత అజాద్ ప్రకటనలో తెలపడంతో ఈ విషయం వెల్లడైంది. దీంతో సంతోష్ తల్లిదండ్రులు అన్నె ఐలోని, సమ్మక్కతోపాటు పలువురు బంధువులు, గ్రామపెద్దలు శనివారం రాత్రే రెండు వాహనాల్లో ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌కు వెళ్లారు. పోస్టుమార్టం అనంతరం పోలీసులు సంతోష్ మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు. అంబులెన్స్‌లో మృతదేహం ఆదివారం రాత్రి చేరుకుంది. మృతదేహాన్ని ఇంటివద్ద కొద్దిసేపు ఉంచి అనంతరం అంతిమయాత్ర నిర్వహించి అంత్యక్రియలు జరిపారు. రెండున్నర దశాబ్దాల క్రితం కనిపెంచిన తల్లిదండ్రులను, ఉన్న ఊరిని వదిలి ఉద్యమబాట పట్టిన సంతోష్ మృతదేహాన్ని చూసి గ్రామస్థులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

అంతిమయాత్ర

యుక్త వయస్సులోనే ఉద్యమానికి ఆకర్షితుడై అడవిబాట పట్టిన అన్నె సంతోష్ అలియాస్ సాగర్ సాధారణ మిలిటెంట్ నుంచి దళసభ్యుడు, కమాండర్, డివిజనల్ కమిటీ మెంబర్, దండకారణ్య తెలంగాణ స్పెషల్ జోనల్

మిగతా 6వ పేజీలో...



సంతోష్ అంతిమయాత్రలో పౌర సంఘాల నేతలు

హత్య కేసులో నిందితుల అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ మల్లేష్

చిట్యాల, ఏప్రిల్ 7: మండలంలోని జడల్‌పేటలో శనివారం జరిగిన మహిళా హత్య కేసులో ఆమె భర్త, కుమారుడిని పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితులను సీఐ మల్లేష్ ప్రవేశ పెట్టారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..

జడల్‌పేట గ్రామానికి చెందిన కామని చిరంజీవికి రేగొండ మండలం రంగయ్యపల్లికి చెందిన విజయలక్ష్మితో 30 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. మద్యం, జల్సాలకు బానిసైన చిరంజీవి కొంత వ్యవసాయ భూమికి విక్రయించాడు. దీంతో భార్యాభర్తల మధ్య మనస్పర్థలు వచ్చాయి. ఈ క్రమంలో బంధువులు కలిసి రెండెకరాల వ్యవసాయ భూమిని విజయలక్ష్మి పేరున రిజిస్ట్రేషన్ చేయించారు. దీంతో ఆ భూమిని తన పేరున రిజిస్ట్రేషన్ చేయించాలని కొంతకాలంగా భార్యపై చిరంజీవి ఒత్తి చేస్తున్నాడు. ఆమె వినకపోవడంతో పెద్ద కుమారుడు గణేష్‌తో కలిసి పథకం రచించాడు. ఇంట్లోనే విజయలక్ష్మిని తండ్రీ కొడుకులు కలిసి గొంతు నులిమి హత్య చేశారు. అనంతరం ఇంట్లోంచి వారు పారిపోవడంతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టి చిట్యాల శివారులో అదుపులోకి తీసుకున్నట్టు సీఐ వెల్లడించారు. విలేకరుల సమావేశంలో ఏఎస్సై మధుసూదన్, హెడ్ కానిస్టేబుల్ ఎం.డి.గౌస్, బాలకృష్ణ, నవీన్, లాల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

రానున్నది రామరాజ్యమే..

బీజేపీ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి సీతారాం నాయక్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి సీతారాం నాయక్

వెంకటాపూర్(రామప్ప), ఏప్రిల్ 7: ఎవరెన్ని కుట్రలు పన్నినా రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తుందని, రామరాజ్య స్థాపన జరుగుతుందని ఆ పార్టీ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి అజ్మీరా సీతారాంనాయక్ అన్నారు. ములుగు నియోజకవర్గంలోని వెంకటాపూర్ మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గులాబీ దండు రాష్ట్రాన్ని పూర్తిగా దోచుకుని అది చాలదన్నట్టు ఇప్పుడు దేశంపై పడ్డారని వ్యాఖ్యానించారు. కేసీఆర్ కుమార్తె కవిత లిక్కర్‌డాన్‌గా మారారని, ఇది రాష్ట్ర సంక్షేమానికి ఎంతమాత్రం మంచిది కాదని అన్నారు. బీఆర్ఎస్ కుంభకోణాలు, అక్రమాలు, అడ్డగోలు భాగోతాలు బట్టబయలవుతాయన్న అక్కసుతో లేని కుట్రలకు తెరలేపడం సమంజసం కాదని హితవు పలికారు. ఎవరెన్ని జిమ్మిక్కులు చేసినా, ఎంత వంగి సలామ్ చేసినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని పేర్కొన్నారు. జనం ఓట్లేసి ఆదరిస్తారని బీఆర్ఎస్ భావిస్తే అంతకంటే అత్యాశ మరొకటి ఉండదని స్పష్టం చేశారు. ఈసమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం, ఉపాధ్యక్షుడు భూక్య జవహర్‌లాల్, నాయకులు సరోత్తమ్‌రెడ్డి, పైడాకుల మల్లేష్, అల్లె శోభన్, కారుపో తుల యాదగిరిగౌడ్, గంగుల రాజు, నరేందర్, రవీంద్రాచారి, కొత్త సురేందర్, రవి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌కౌంటర్‌పై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి

గోవిందరావుపేట : తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సహరిద్దులో శనివారం జరిగిన ఎన్‌కౌంటర్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించాలని మాజీ ఎంపీ, బీజేపీ మహబుబాబాద్ ఎంపీ అభ్యర్థి అజ్మీరా సీతారాం నాయక్ డిమాండ్ చేశారు. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని పస్రాలో ఆదివారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో సీతారాం నాయక్ మాట్లాడారు. ఒకప్పుడు మావోయిస్టులు ప్రగతిభవన్‌ను పేల్చివేసి నిబద్ధతను చాటుకోవాలని మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తుతం జరుగుతున్న ఎన్‌కౌంటర్లపై ఎందుకు నోరు మెదప డంలేదని ప్రశ్నించారు. నిజమైన ఎన్‌కౌంటరా.. బూటకమా..? అన్నది ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోతే ప్రజలకు ఎలా తెలుస్తుందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వ నాలుగునెలల పాలనలో రాష్ట్రంలో కరువు విలయతాండవం చేస్తోందని, పంటలు ఎండి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, కరువు మండలాలను ప్రకటించకపోవడం, కరువుపై నివేదికలు కేంద్రానికి పంపకపోవడం ప్రభుత్వ చేత కానితనానికి నిదర్శనమని ఆరోపించారు. ధాన్యం క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని, రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని, రైతుకూలీలకు రూ.12వేల సాయం అందిస్తామని అమలుకాని హామీలిచ్చారని, వాటిని ఎందుకు అమలుచేయడం లేదని అన్నారు. రాష్ట్రంలో, కేంద్రంలో ఒకే ప్రభుత్వం ఉండడం ద్వారా అభివృద్ధి వేగంగా జరుగుతుందని పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ములుగులో సమ్మక్క, సారక్క జాతీయ గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు కోసం చేసిన ప్రయత్నం లోనూ తాను ముందున్నానని గుర్తు చేశారు. రామప్ప దేవాలయానికి యునెస్కో గుర్తింపు రావడంలో ప్రయత్నం చేశానని తెలిపారు. మండలంలో తాగునీటి సమస్య పరిష్కారానికి, కుంగిన వంతెనను 24గంటల్లో మరమ్మతు చేయించడంలోను, సీసీరోడ్ల నిర్మాణంలోను ముందున్నానని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబాబాద్ ఎంపీగా పోటీచేస్తున్న తనను భారీ మెజారిటీతో గెలిపించాలని, ఇందుకోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆయన కోరారు. బీజేపీ మండల అధ్యక్షుడు మద్దినేని తేజరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం, జిల్లా ఇన్‌చార్జి సరోత్తమ్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఏనుగు రవీందర్‌రెడ్డి, నాయకులు రుద్రారపు సురేష్, తక్కళ్లపల్లి దేవేందర్‌రావు, జాడి వెంకట్, కర్ర సాంబశివుడు, నామవరపు విజయలక్ష్మి, అంకిరెడ్డి రమాదేవి, కొత్త సుధాకర్‌రెడ్డి, సత్యనారాయణ, నరేంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష

భూపాలపల్లిటౌన్, ఏప్రిల్ 7: ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. విద్యాశాఖ అధికారులు జిల్లాలో ఆరు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పరీక్షకు ఉదయం ఆరో తరగతి విద్యార్థులు హాజరు కాగా మధ్యాహ్నం 7, 8, 9 తరగతుల విద్యార్థులు హాజరయ్యారు. ఆరో తరగతి ప్రవేశ పరీక్షకు 328 మంది దరఖాస్తు చేసుకోగా 196 మంది విద్యార్థులు హాజరయ్యారని, ఏడో తరగతికి 59 మంది దరఖాస్తు చేసుకోగా 38 మంది, ఎనిమిదో తరగతిలో 40 మందికి 29 మంది, తొమ్మిదో తరగతిలో 30 మంది దరఖాస్తు చేసుకోగా 21 మంది హాజరైనట్లు డీఈవో రామ్‌కుమార్ తెలిపారు. ఈ అర్హత పరీక్షలో మార్కుల ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేస్తామని అన్నారు అడ్మిషన్ పొందిన విద్యార్థులకు ఇంటర్మీడియట్ వరకు విద్యాబోధన ఉంటుందని తెలిపారు.

మేడారంలో మొక్కులు

సందడిగా వనదేవతల సన్నిధి



వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

మేడారం, ఏప్రిల్ 7: వనదేవతలు సమ్మక్క, సారలమ్మలను దర్శించుకొనేందుకు భక్తులు ఆదివారం మేడారం చేరుకున్నారు. వారాంత సెలవు కావడంతో అధిక సంఖ్యలో తరలివచ్చారు. పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, చీరె, సారె, కొబ్బరి కాయలు సమర్పించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. మహాజాతర ముగిశాక కూడా బుధ, గురు, శుక్ర, ఆదివారాల్లో అమ్మవార్లను దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి వస్తున్నారు. ఆదివారం 10వేల మందికి పైగా భక్తులు వనదేవతల గద్దెలను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.

అసౌకర్యాలపై ఆగ్రహం

దేవాదాయ శాఖ అధికారులు భక్తులకు కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయడంలేదని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మహా జాతర అనంతరం సమ్మక్క, సారలమ్మలను దర్శించుకొవడానికి వస్తున్న వారిని పట్టించుకోవడంలేదని విమర్శిస్తున్నారు. ఎండలు అధికంగా ఉడడంతో దర్శనం సమయంలో గద్దెల ప్రాంగణంలో తాగునీరు, మరుగుదొడ్లు తదితర కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదంటున్నారు. దీంతో వృద్ధులు, మహిళలు, పిల్లలు ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తోందని అంటున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులకు కనీస వసతి కూడా లేకపోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మహా జాతరల సమయంలో ఏర్పాటు చేసిన అతిథిగృహాలకు తాళాలు వేసుకున్నారని, దీంతో విడిది ఇబ్బందికరంగా ఉందని అంటున్నారు.

కాళేశ్వరంలో భక్తుల సందడి



గోదావరి తీరంలో భక్తుల సందడి

మహదేవపూర్, ఏప్రిల్ 7: మండలంలోని కాళేశ్వరంలో ఆదివారం సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. త్రివేణి సంగమం గోదావరిలో స్నానాలు ఆచరించారు. స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమ ఫలాలు

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

మొగుళ్లపల్లి, ఏప్రిల్ 7: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అన్ని వర్గాలకూ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. భూపాలపల్లి నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధిచేసే బాధ్యత తనపై ఉందని అన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో సమన్వయంతో ఉంటూ పార్టీ ఎంపీ అభ్యర్థిని గెలిపించుకోవాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాల్లో ఎలాంటి అవినీతికి తావులేకుండా పకడ్బందీగా అర్హులైన లబ్ధిదారులందరికీ అందుతున్నాయని అన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. ఈసమావేశంలో రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, భూపాలపల్లి ఎన్నికల పరిశీలకుడు మార్క విజయ్, జిల్లా నాయకుడు కట్టంగూరి రాంనర్సింహారెడ్డి, మండల అధ్యక్షుడు ఆకుతోట కుమారస్వామి, నాయకులు ఎర్రబెల్లి పున్నంచందర్‌రావు, ఖ్యాతరాజు రమేష్, పోలినేని లింగారావు, తక్కళ్లపల్లి రాజు, ఎమ్డీ.రఫి, నడిగోటి రాము తదితరులు పాల్గొన్నారు.

గెలుపు కాదు.. అధిక మెజారిటీ సాధించాలి..

- వరంగల్ లోకసభ ఎన్నికకు సన్నద్ధమవ్వండి..
- అభ్యర్థి గెలుపు కోసం సమన్వయంతో పని చేయండి
- జిల్లా నేతలతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష, దిశా నిర్దేశం

5లో

ఓరుగల్లు వాసుల అభిమానం మరువలేనిది...

మీడియాతో సినీ హీరో నవదీప్

వడ్డేపల్లి, ఏప్రిల్ 7: ఓరుగల్లుతో తనకు ఉన్న అభిమానం మరువలేనిదని, అందమైన లోకేషన్లకు పెట్టింది పేరు ఓరుగల్లు నగరమని సినీ హీరో నవదీప్ అన్నారు. తాను నటించిన లవ్, మౌళి చిత్ర విశేషాలను ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మీడియాకు వివరించారు. ఈ సందర్భంగా నవదీప్ మాట్లాడుతూ.. గతంలో తాను ఐదు సినిమాల్లో వైవిధ్యమైన పాత్రలు పోషించి ప్రేక్షకులకు గుర్తుండేలా మెప్పించానని అన్నారు. తాను నటించిన నూతన చిత్రం లవ్, మౌళి ఈ నెల 19న విడుదల కానుందని ప్రేక్షకులు, అభిమానులు ఆదరించాలని కోరారు. ఈ సినిమాలో తాను హీరోగా, పంఖురి గిద్వానీ హీరోయిన్‌గా నటించగా, మిగతా పాత్రల్లో భావన సాగి, మిర్చి హేమంత్, మిర్చి కిరణ్ నటిస్తున్నారని చెప్పారు. నైరా క్రియేషన్స్ అండ్ శ్రీకర బ్యానర్‌పై ఈ చిత్రాన్ని హైదరాబాద్‌లోని సిస్పేస్ స్టూడియోలో నిర్మిస్తున్నట్లు తెలిపారు. చిత్రానికి రచన, దర్శకత్వం, సినిమాటోగ్రఫీ, ఎడిటింగ్ అవనింద కాగా, సంగీత దర్శకులుగా గోవింద్ వసంత సమకూర్చగా పాటలను అనంత శ్రీరాం రాశారని వెల్లడించారు.


మాట్లాడుతున్న నవదీప్

'ఉపాధి'లో మహిళలదే అగ్రస్థానం

● 2023-24లో ఎక్కువ పనిరోజులు వారివే.. ● కూలీ రేట్లు పెరగడంతో మహిళల్లో పెరిగిన ఉత్సాహం

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 7: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉపాధిహామీ కూలీ పనులు మహిళలకు వరంగా మారాయి. మహిళలు ఇంటిని చక్కబెట్టడమే కాకుండా కుటుంబ పోషణకు కావాల్సిన సహాయా న్ని తమవంతుగా చేస్తున్నారు. అలాగే పురుషులతో సమానంగా వ్యవసాయ కూలీ పనులు కూడా చేస్తూ తాము ఎందులో కూడా తక్కువ కాదని నిరూపిస్తున్నారు. 2023-24 ఏడాదిలో పని దినాలు వినియో గించుకున్న ఉపాధి హామీ కూలీల్లో పురుషులకంటే మహిళలే ముందు వరుసలో నిలిచారు. ఉపాధి హామీ పథకం ప్రారంభించిన మొదట్లో పురుషులు ఎక్కువగా పనులకు వెళ్లేది కానీ రోజులు గడుస్తున్న కొద్ది ఈ పనుల్లో మహిళలు దూసుకెళుతున్నారు. మగవారితో సమానంగా పార, గడ్డపార చేతపట్టుకుని పనులు చేస్తున్నారు. మహిళలకు వారి వారి గ్రామాల్లోనే ఉపాధి హామీ పని దొరుకుతుండటంతో వారు వ్యవసాయ పనులు ఉన్న రోజులు మినహాయిస్తే మిగతా అన్ని రోజుల్లో ఉపాధి హామీ పనులు చేస్తున్నారు. ప్రస్తుతం హనుమకొండ జిల్లాలో ఉన్న 14 మండలాల్లో ఉపాధి హామీ పనులు జోరుగా సాగుతున్నాయి.

- పురుషులకంటే మహిళలే ఎక్కువ

2023-24 సంవత్సరంలో జిల్లాలో మొత్తం 25,97,662 మంది ఉపాధి హా మీ కూలీ పనులు చేయగా వీరిలో 60శాతం మహిళలే పని చేసినట్లు జిల్లా డీఆర్‌డీఏ అధికారులు తెలిపారు. 2023 సంవత్సరం జనవరి నెలలో 20,998, ఫిబ్రవరిలో 1,38,941, మార్చిలో 2,37,038, ఏప్రిల్ లో 3,56,672, మే నెలలో 4,03,576, జూన్‌లో 4,89,487, జులైలో 1,03,847, ఆగస్టులో 31,089, సెప్టెంబర్‌లో 23,406, అక్టోబర్‌లో 70,782, నవంబర్‌లో 97,376, డిసెంబర్ నెలలో 69,029 మంది ఉపాధి హామీ పనులు చేయగా, 2024 జనవరి నెలలో 62,471, ఫిబ్రవరి నెలలో 1,73,117, మార్చిలో 3,19,842 మంది


ఆత్మకూరు మండల కేంద్రంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న మహిళలు

కూలీలు ఉపాధి హామీ పనులు చేశారని, వీరిలో 60శాతం మహిళలు పని చేశారు.

- కూలీ రేట్లు పెరగడంతో ఉత్సాహం

మన రాష్ట్రంలో ఉపాధిహామీ కూలీ మార్చి 31 వరకు రూ.272 చెల్లించారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం కూలీ రేటు రూ.28 పెంచింది. ఈ నెల 1వ తేదీ నుంచి ఉపాధి హామీ కూలీలకు రూ.300 చెల్లిస్తున్నారు. కూ లీ రేట్లు కూడా పెరగడంతో మహిళలు ఉపాధి హామీ పనులు చేసేందుకు మరింత ఉత్సాహంతో సిద్ధంగా ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి ఒక్క కూలీకి 100 రోజులు కల్పిస్తుంది. కూలీ రేటు పెరగకముందు కొందరు కూలీలు వారికి కేటాయించిన కనీసం 100 రోజులు పనులు కూడా చేసే వారు కాదని, ప్రస్తుతం కూలీ రేటు పెరగడంతో అందరు 100 రోజుల కూలీ చేస్తారని ఉపాధి హామీ కూలీలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఈజీఎస్‌లో ముఖ గుర్తింపు హాజరు

ఎన్ఎంఎంఎస్ యాప్ అందుబాటులోకి తీసుకొచ్చిన కేంద్ర ప్రభుత్వం

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 7 : ఉపాధి హామీ పనుల్లో కేంద్ర ప్రభుత్వం నూతన విధానానికి శ్రీకారం చుడుతోంది. ఉపాధి హామీ పనులకు వచ్చే కూలీలకు హాజరు విధానాన్ని అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. దీనిలో భాగంగా కూలీల ముఖ గుర్తింపు హాజరు విధానాన్ని అమలు చేసేందుకు సన్నద్ధమవుతోంది. దీనికోసం ఇప్పటికే నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ (ఎన్ఎంఎంఎస్)యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇప్పటికే జిల్లాలోని కొన్ని గ్రామాల్లో ఎన్ఎంఎంఎస్ యాప్ పనితీరును పరిశీలించారు. ఈ యాప్ వాడటానికి సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కూడా ఇచ్చారు.

పనుల్లో పారదర్శకతకు పెద్దపీట

ఉపాధిహామీ పనుల్లో కూలీలు అలా వచ్చి ఇలా వెళుతూ సరిగా పని చేయకుండానే కూలీ డబ్బులు తీసుకుంటున్నారనే ఆరోపణలు చాలా వరకు ఉన్నాయి. కూలీల హాజరు నమోదు విషయంలో తరచుగా వివాదాలు తలెత్తుతున్న సందర్భాలు చాలావరకు ఉన్నాయి. గతంలో చేసిన సామాజిక తనిఖీల్లో మస్టర్లపై ఎన్నో లోపాలు బయటపడ్డాయి. ఈ లోపాలను అడ్డుకట్ట వేసేందుకు, అర్హులైన కూలీలకు న్యాయం చేసేందుకు కూలీలకు ముఖ విధానం హాజరు అనేది ఎంతగానో ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఆ యాప్‌ను అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. హనుమకొండ జిల్లాలో 208 గ్రామాలు ఉన్నాయి. సుమారు150 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు. 91వేల చిల్లర జాబ్ కార్డులు ఉండగా, ఇందులో 62వేల జాబ్ కార్డులు ఆక్టివ్‌గా ఉన్నాయి. జిల్లాలో మొత్తం ఒక లక్షా 4వేల మంది కూలీలు ఉన్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న జాబ్‌కార్డుల్లోని సభ్యులందరికీ ఇప్పటికే ఆధార్ కార్డును అనుసంధానం చేశారు. త్వరలో ఆ యాప్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని డీఆర్‌డీఏ అధికారులు తెలిపారు.

హాజరు విధానం అమలు ఇలా..

ఉపాధిహామీ పని ప్రదేశాల్లో మొదటగా కూలీల ముఖ చిత్రాలను నమోదు చేస్తారు. తర్వాత కూలీ ఫొటో, ఆధార్‌తో అంతకుముందు దిగిన ఫొటో సరిపోలితేనే వారికి హాజరు పడుతుంది. కూలీలు పనిచేసే రోజు ఉదయం, మధ్యాహ్నం కూలీల ముఖ చిత్రీకరణ తప్పనిసరిగా ఉంటుంది. ఈ విధానం ద్వారా ఉపాధి పనుల్లో ఎలాంటి అక్రమాలు జరగకుండా ఉంటుందనేది కేంద్ర ప్రభుత్వం ఆలోచన. ఈ విధానం త్వరలో ఆచరణలోకి వచ్చే అవకాశం ఉంది.

మునిసిపాలిటీలకు అమృత్‌యోగం

» తాగునీటి వ్యవస్థ పటిష్టానికి చర్యలు

» ఉమ్మడి జిల్లాలో మునిసిపాలిటీలకు నిధులు కేటాయింపు

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 7: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఐదు మునిసిపాలిటీలకు అమృత్ యోగం లభించింది. మునిసిపాలిటీల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ఇటీవల పెద్ద ఎత్తున నిధులు విడుదల చేసింది. ఈ నిధులతో కులాయి కనెక్షన్లు, ట్యాంకుల నిర్మాణం, కాలనీల అభివృద్ధి, పైప్‌లైన్‌ల ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం సంబంధిత అధికారులను ఆదేశించింది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను శనివారం విడుదల చేసింది. అమృత్ -2 విడతలో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పరకాల, నర్సంపేట, జయశంకర్ భూపాలపల్లి, వర్ధన్నపేట ఐదు మున్సిపాలిటీలకు మొత్తం కలిగిస్తూ రూ.132కోట్లు విడుదల చేసిం ది. ఆయా జిల్లాల అధికారులకు బడ్జెట్‌కు సంబంధించిన ప్రొసీడింగ్‌లను జారీ చేసి ంది. దీంతో సంబంధిత మునిసిపాలిటీల అధికారులు అభివృద్ధి పనులు చేసేం దుకు కాంట్రాక్టర్‌లను కాల్‌ఫర్ చేసినట్లు తెలిపారు. కానీ లోక్‌సభ ఎన్నికల కోడ్ ఉండడ ంతో ఎలాంటి అభివృద్ధి పనులు చేయకూడదని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందడంతో పనులు నిలిపివేసినట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు. అయితే ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఐదు మునిసిపాలిటీలలో పనులను బట్టి నిధులు విడుదల చేస్తామని మునిసిపాలిటీల వారిగా నిధులు విభజించలేదని తెలిపారు.

యూఐడీఎఫ్ ద్వారా బల్దియాకు నిధులు

ఈ యేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మునిసిపాలిటీల అభివృద్ధి కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించినా గ్రేటర్ వరంగల్ మునిసిపాలిటీకి అమృత్ -2 విడతలో భాగంగా ఎలాంటి నిధులు కేటాయించలేదు. మూడేళ్ల కిందట మొదటి విడతలో భాగంగా వరంగల్ బల్దియాకు అమృత్ పథకం ద్వారా 562 కోట్లు కేటాయించగా, ఆ నిధులతో గ్రేటర్ వరంగల్‌లోని 66 డివిజన్‌లలో ఇప్పటికి అభివృద్ధి పనులు జరుగుతూనే ఉన్నాయి. దీంతో వరంగల్ బల్దియాను మినహాయించి ఉమ్మడి జిల్లాలోని మిగతా ఐదు మునిసిపాలిటీలకు నిధులు కేయించినట్లు అధికారులు తెలిపారు. అయితే వరంగల్ నగర పాలక సంస్థకు కేటాయించిన అమృత్ నిధులు పూర్తయిన తర్వాత యూఐడీఎఫ్ (అర్బన్ ఇన్‌ఫ్రా డెవలప్ ఫండ్) ద్వారా ప్రత్యేక నిధులు విడుదల చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఎన్నికలు ముగిసిన తర్వాత యూఐడీఎఫ్ నిధులు విడుదల చేస్తారనే ప్రచారం జరుగుతోంది. ఈ నిధుల ద్వారా వరంగల్ నగరంతో పాటు విలీన గ్రామాలు సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకోబోతున్నాయి.

ఉగాది పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 7: హైదరాబాద్‌లోని ఆల్ ది బెస్ట్ అకాడమీ ఆధ్వర్యంలో అందజేయనున్న ఉగాది పురస్కారాల కోసం దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఈఎస్ఎస్. నారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాహిత్య, సాంస్కృతిక సామాజిక సేవా రంగాల్లో సేవలందిస్తున్న ఆసక్తి కలిగిన వారు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు. ఏప్రిల్ 21న హైదరాబాద్‌లో నిర్వహించే పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఎంపిక చేసిన వారికి పురస్కారాలు ప్రదానం చేస్తామని పేర్కొన్నారు. ఈ నెల 10లోగా దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా కోరారు. పూర్తి వివరాలకు 9652347207 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

ప్రశాంతంగా మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

వరంగల్, హనుమకొండ జిల్లాల్లోని మోడల్ స్కూల్లో ప్రవేశాల కోసం ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. వరంగల్ జిల్లాలో 910 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 665 మంది హాజరు కాగా 245 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. హనుమకొండ జిల్లాలో 660 మంది విద్యార్థులకు గాను 489 మంది హాజరుకాగా 171 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష ప్రశాంతంగా నిర్వహించడానికి సహకరించిన ప్రతీ ఒక్కరికీ డీఈవోలు అబ్దుల్ హై, వాసంతి కృతజ్ఞతలు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

హనుమకొండటౌన్, ఏప్రిల్7: ఎలాంటి అనుమతి లేకుండా తరలిస్తున్న ఇసుకట్రాక్టర్‌ను హనుమకొండ పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. వారి కథనం ప్రకారం.. సోమవారం ఉదయం కేయూ జంక్షన్‌లో పోలీసులు ట్రాక్టర్‌ను ఆపడానికి ప్రయత్నిస్తుండగా పోలీసులను చూసి ట్రాక్టర్ దిగి పారిపోయేందుకు యత్నించాడు. డ్రైవర్ అనుమల సొమయ్యను అదుపులోకి తీసుకొని విచారించగా ఎలాంటి ఆధారాలు చూపించలేదు. ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

గెలుపు కాదు.. అధిక మెజారిటీ సాధించాలి..

● వరంగల్ లోక్‌సభ ఎన్నికకు సన్నద్ధమవ్వండి.. ● జిల్లా నేతలతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష.. దిశా నిర్దేశం

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 7: వరంగల్ లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ విజయమే కాదు.. అత్యధిక మెజారిటీ సాధన లక్ష్యంగా పని చేయాలని జిల్లా నేతలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. వరంగల్ లోక్‌సభ ఎన్నిక, పార్టీ విజయం, మెజారిటీ, నియోజకవర్గాల వారిగా పార్టీ పరిస్థితి, ఎన్నిక ప్రచార సభలు, కమిటీల నిర్మాణం, నేతల బాధ్యతలు తదితర అంశాలపై మంత్రి కొండా సురేఖ, వరంగల్ లోక్‌సభ అసెంబ్లీ సెగ్మెంట్ల ఎమ్మెల్యేలు, జిల్లా పార్టీ అధ్యక్షులు, ఇతర ముఖ్య నేతలతో ఆదివారం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో సమీక్ష జరిపారు. పార్టీ గెలుపు కోసం దిశా, నిర్దేశం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ గెలుపు సాధించడంతో ఢిల్లీ అధిష్ఠానం ఇక్కడి నుంచి ఎంపీ సీట్లపై దృష్టి పెట్టిందన్నారు. ఈ క్రమంలో మరింత కష్టపడి చేయాల్సిన బాధ్యత నెలకొందన్నారు. 14 ఎంపీ స్థానాలను గెలిపించి అధిష్ఠానం ఆశలను నెరవేర్చే లక్ష్యంతో ఉన్నట్లు రేవంత్‌రెడ్డి జిల్లా నేతలకు తెలియచేశారు. ఈ క్రమంలో ప్రతీ సీటు కోసం అహర్నిశలు కృషి చేయాలన్నారు. ఎన్నికల్లో టికెట్ అందరూ ఆశిస్తారని, అయితే అధిష్ఠానం అన్ని కోణాల్లో ఆలోచించి నిర్ణయం తీసుకుందని రేవంత్‌రెడ్డి జిల్లా నేతలకు సూచించారు. పార్టీకి సేవలందించిన అందరికీ న్యాయం చేస్తుందని, ఈ విషయంలో ఎలాంటి సందేహానికి తావు లేదన్నారు. ఈ బాధ్యత తనదిగా గుర్తించాలని పేర్కొన్నారు. అధిష్ఠానం ప్రకటించిన అభ్యర్థి డాక్టరు కడియం కావ్యను అత్యధిక మెజారిటీతో గెలిపించేలా కృషి చేయాలని జిల్లా నేతలకు ఉద్బోధించారు. టికెట్ దక్కని వారు నిరాశ చెందొద్దని, న్యాయం చేస్తానని రేవంత్‌రెడ్డి భరోసా ఇచ్చారు. వరంగల్ లోక్‌సభ పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్లలో గ్రామస్థాయి నుంచి పార్టీ విజయ వ్యూహాల ప్రణాళికలను రూపొందించాలని రేవంత్‌రెడ్డి సూచించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు, జిల్లా అధ్యక్షులు ఈ విషయంలో అందరినీ సమన్వయం చేసుకుంటూ నివేదికలు సిద్ధం చేసి అందచేయాలని ఆదేశించారు. ప్రతికూల పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిష్కరించే చర్యలు చేపట్టాలని సూచించారు. లోక్‌సభ ఎన్నిక నేపథ్యంలో ఈ నెల 18లోగా బూత్‌స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు కమిటీలు నిర్మించాలని సీఎం సూచించారు. కమిటీలను నిర్మించి బాధ్యతలను స్పష్టం చేయాలన్నారు. కమిటీలు పనితీరును బేరీజు వేసుకొని భవిష్యత్తులో వారికి పార్టీ గుర్తింపు ఇస్తుందన్నారు. ఎన్నికల క్రమంలో వరంగల్ లోక్‌సభ పరిధిలో మూడు ప్రచార సభలకు హాజరు అవుతానని రేవంత్‌రెడ్డి జిల్లా నేతలకు తెలియచేశారు. రెండు నుంచి మూడేసి నియోజకవర్గాలను కలిపి ఒక ప్రచారసభ నిర్వహణ ఉండేలా ప్రణాళికలు ఉంటాయన్నారు. దీనిపై త్వరలోనే స్పష్టత ఇవ్వనున్నట్లు నేతలకు సూచించారు. అగ్రనేతలు రాహుల్‌గాంధీ లేదా ప్రియాంకగాంధీ కూడా ఎన్నిక ప్రచార క్రమంలో వరంగల్ వచ్చే అవకాశం


సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న వరంగల్ జిల్లా కాంగ్రెస్ నేతలు

ఉంటుందని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల కాంగ్రెస్ మేనిఫెస్టో ప్రజాదరణ పొందేలా రూపకల్పన చేశారన్నారు. తుక్కుగూడ సభలో ప్రకటన తర్వాత ప్రజల నుంచి భారీ స్పందన లభిస్తోందన్నారు. ఈ క్రమంలో మేనిఫెస్టోను గ్రామ గ్రామంలో ఇంటింటికీ తీసుకెళ్తే విజయం తథ్యమన్నారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఏ భేషజాలు లేకుండా ప్రతీ ఒక్కరు సమన్వయంతో పని చేయాలని రేవంత్‌రెడ్డి దిశా, నిర్దేశం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మంత్రి కొండా సురేఖ, వరంగల్ లోక్‌సభ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, నాగరాజు, యశస్వినిరెడ్డి, గండ్ర సత్యనారాయణ, కడియం శ్రీహరి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, గ్రంథాలయ సంస్థ రాష్ట్ర చైర్మన్ డాక్టరు రియాజ్, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, టీపీసీసీ ఎస్సీ సెల్ నాయకుడు మోజెస్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

తప్పక న్యాయం చేస్తా..

వరంగల్ లోక్‌సభ టికెట్ ఆశించి భంగపడ్డ వారిలో సమీక్షకు హాజరైన దొమ్మాటి సాంబయ్య, నమిండ్ల శ్రీనివాస్, బొడ్డు సునిత మోజెస్ తదితరులతో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. కడియం కావ్య గెలుపు కోసం పని చేయాలని, భవిష్యత్తులో తప్పక న్యాయం చేస్తానని, ఇది తన భరోసా అంటూ నచ్చ చెప్పారు. మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా టికెట్ ఆశించి నిరాశ పడిన వారిని స్వయంగా కలిసి మాట్లాడాలని సూచించారు.

15 నుంచి కేయూ ఎంఫార్మసీ పరీక్షలు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 7: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఏప్రిల్ 15 నుంచి ఎంఫార్మసీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ విద్యార్థులకు 2023-24 ఏడాదికిగాను పరీక్షల నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ చాడ రాధికారెడ్డి ఆదివారం షెడ్యూల్‌ను ప్రకటించారు. ఏప్రిల్ 15, 18, 20, 22తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు.

16 నుంచి బీపీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలు

ఏప్రిల్ 16 నుంచి కేయూ పరిధిలో బీపీఈడీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్, ఎక్స్ ఇంప్రూమెంట్ అభ్యర్థులకు పరీక్షల నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారులు వెల్లడించారు. ఏప్రిల్ 16, 18, 20, 22 ,తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షల జరుగుతాయని తెలిపారు. కేయూ క్యాంపస్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల, ఖమ్మంలోని యూనివర్సిటీ పీజీ కళాశాలలో సెంటర్లు ఏర్పాటు చేశారు.

18 నుంచి ఎంపీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలు

ఏప్రిల్ 18 నుంచి కేయూ పరిధిలో బీపీఈడీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్, ఎక్స్ ఇంప్రూమెంట్ అభ్యర్థులకు పరీక్షల నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారులు వెల్లడించారు. ఏప్రిల్ 18, 20, 23, 25 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు పరీక్షల జరుగుతాయని తెలిపారు. కేయూ క్యాంపస్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో పరీక్షల సెంటర్‌ను ఏర్పాటు చేశారు.

16 నుంచి ఎంపీఈడీ మూడో సెమిస్టర్ పరీక్షలు

ఏప్రిల్ 16 నుంచి కేయూ పరిధిలో ఎంపీఈడీ మూడో సెమిస్టర్ రెగ్యులర్, ఎక్స్ ఇంప్రూమెంట్ అభ్యర్థులకు పరీక్షల నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారులు వెల్లడించారు. ఏప్రిల్ 16, 19, 22, 24 తేదీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు పరీక్షల జరుగుతాయన్నారు. కేయూ క్యాంపస్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల, ఖమ్మంలోని యూనివర్సిటీ పీజీ కళాశాలలో సెంటర్లు ఏర్పాటు చేశారు.

కేయూ బీఫార్మసీ సెమిస్టర్ ఫీజుల చెల్లింపు గడువు 18

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 6: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో బీఫార్మసీ సీబీసీఎస్ రెండు, నాలుగో, ఆరో రెగ్యులర్, సప్లిమెంటరీ, ఇంప్రూమెంట్ అభ్యర్థులు ఏప్రిల్ 18 వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఫీజులు చెల్లించుకోవాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్‌చాడ రాధికారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 250 అపరాధ రుసుంతో ఏప్రిల్ 20 వరకు ఫీజులు చెల్లించుకునే అవకాశం ఉందన్నారు. పరీక్షలు ఏప్రిల్, మేలో నిర్వహిస్తామని వెల్లడించారు. ఇతర వివరాలకు కేయూ వెబ్‌సైట్‌లో చూడాలని కోరారు.

ఎంహెచ్‌డీ జిల్లా అధికార ప్రతినిధిగా ప్రసాద్

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 7: మాదిగ హక్కుల దండోరా (ఎంహెచ్‌డీ) ఉమ్మడి వరంగల్ జిల్లా అధికార ప్రతినిధిగా కేతపాక ప్రసాద్ ఆదివారం నియమితులయ్యారు. మాదిగ హక్కుల కోసం, ఆత్మ గౌరవం, అభివృద్ధి కోసం నిస్వార్థంగా పోరాడాలని ఎంహెచ్‌డీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గనిపాక ప్రదీప్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

వరంగల్ క్రైం, ఏప్రిల్7: అతివేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో టూవీలర్‌పై వెళుతున్న గిన్నారపు రాజు(34) మృతి చెందిన సంఘటన హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. హౌస్ షిఫ్టింగ్ వర్క్ చేసే అనంతసాగర్ గ్రామానికి చెందిన రాజు ఆదివారం ఉదయం హనుమకొండకు వస్తున్న క్రమంలో హసన్‌పర్తి చెరువు వద్ద హనుమకొండ నుంచి కరీంనగర్ వెళుతున్న కారు ఢీకొట్టింది. వేగంగా ఢీకొట్టడంతో పక్కన పొలాల్లో ఎగిరిపడిన రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. తన భర్త మృతికి కారణమని కారు డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాని రాజు సతీమణి రాధ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు.

సమస్యల పరిష్కారమే పీఆర్‌టీయూ ధ్యేయం

రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి పులి దేవేందర్ ముదిరాజ్

న్యూశాయంపేట, ఏప్రిల్ 7 : సమస్యల పరిష్కారమే పీఆర్‌టీయూ ధ్యేయమని రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి పులి దేవేందర్ ముదిరాజ్ అన్నారు. హంటర్ రోడ్డులోని ఉమ్మడి వరంగల్ జిల్లా యూనియన్ కార్యాలయంలో పీఆర్‌టీయూ ములుగు జిల్లా అధ్యక్షుడు వాంకుడోతు జ్యోతి అధ్యక్షతన ఉమ్మడి జిల్లా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి పులి దేవేందర్ ముదిరాజ్ హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయ సమస్యలు ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే శాశ్వతంగా పరిష్కారం చేయాలని కోరారు. కొందరు రాజకీయ నాయకులు ఉపాధ్యాయ సంఘం పేరుతో స్వార్థ ప్రయోజనాల కోసం పాకులాడుతున్నారని అలాంటి వారి మాటలకు మోసపోవద్దని సూచించారు. అనంతరం ములుగు జిల్లా అధ్యక్షుడు జ్యోతి మాట్లాడుతూ.. ఈ వేసవిలో బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని, ఉపాధ్యాయ ఉద్యోగుల డీఏలు త్వరగా మంజూరు చేయాలని అన్నారు. ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి కొయ్యడ సురేందర్ మాట్లాడుతూ.. మేనిఫెస్టోలో చేర్చిన సీపీఎస్ రద్దు అంశాన్ని త్వరగా పరిష్కారం చేయాలని, ప్రభుత్వం కాలయాపన చేయవద్దని కోరారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా అధ్యక్షుడు తాళ్లపెల్లి రాజు, ప్రధాన కార్యదర్శి హర్షం సురేష్, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రాచర్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పసుల శంకర్, జనగాం అధ్యక్షుడు మరిపూకల యాదగిరి, ప్రధాన కార్యదర్శి వాంకుడోతు రవి, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు వల్లబోజు సుధాకర్‌లతో పాటు ములుగు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రౌతు రాజు, రాష్ట్ర నాయకులు రామగిరి సురేష్, జిల్లా నాయకులు సంతోష్, చిరంజీవిలతో పాటు వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పులి దేవేందర్ ముదిరాజ్

అనుభూతులను మూటగట్టుకుని..

● నిట్‌లో ముగిసిన స్ప్రింగ్ స్ప్రీ వేడుకలు ● మూడు రోజుల పాటు సందడిగా క్యాంపస్

హనుమకొండ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ప్రతిష్ఠాత్మకమైన వరంగల్ నిట్‌లో మూడు రోజులపాటు వైభవంగా జరిగిన స్ప్రింగ్ స్ప్రీ (వసంతోత్సవం) ఆదివారం ముగిసింది. వరంగల్ నిట్‌తో పాటు దేశంలోని 40 ఇంజనీరింగ్ కళాశాలల నుంచి పాల్గొన్న విద్యార్థులు ఈ వేడుకల్లో ఉత్సాహంగా, ఉల్లాసంగా పాల్గొన్నారు. స్ప్రింగ్ స్ప్రీని పురస్కరించుకొని నిర్వహించిన 50కిపైగా ఈవెంట్లలో పాల్గొని తమ సత్తాను చాటారు. ప్రతిభాపాటవాలను ప్రదర్శించి బహుమతులను గెలుచుకున్నారు. విద్యార్థులు తమలోని సృజనా త్మకతను చాటేందుకు ఈ వేడుకలు వేదికగా నిలిచాయి. కొత్త పరిచయాలు ఏర్పడ్డాయి. సరికొత్త అనుభూతులు, మరిచిపోలేని జ్ఞాపకాలతో విద్యార్థులు ఇళ్లకు తిరుగు ముఖం పట్టారు.

చివరి రోజు ఈవెంట్లు

ఆదివారం ముగింపు రోజున యూత్ రెడ్ క్రాస్ క్లబ్ ఆధ్వర్యంలో స్కావెంజర్ హంట్ ఈవెంట్ జరిగింది. క్యాంపస్‌లోని వివిధ ప్రదేశాల్లో వైద్య చికిత్సలో ఉపయోగించే కత్తెర, కాటన్ డెట్టాల్, మెడికల్ కిట్ వస్తువులను ఉంచారు. కొన్ని సూచనలు, ఆధారాల సాయంతో విద్యార్థులు వీటిని గుర్తించడం ఈ వెంట్‌లోని అంశం. కరోకే అనే మరో ఈవెంట్‌ను కూడా నిర్వహించారు. కొందరికి వేదికల మీద పాటలు పాడడమంటే భయం. ఆ భయాన్ని తొలగించే ఉద్దేశంతో ఈ ఈవెంట్‌ను నిర్వహించారు. వాట్స్ డిఫరేట్ అనే ఈవెంట్ కూడా విద్యార్థుల ప్రతిభకు పరీక్ష పెట్టింది. రెండు సారూప్య ఇతివృత్తాల మధ్య వ్యత్యాసాలను ఇచ్చిన సమయంలోనే గుర్తించడం ఈ ఈవెంట్ ప్రత్యేకత. వరంగల్ నిట్ సోలో ఐడల్ ఈవెంట్‌లో పాల్గొన్న విద్యార్థులు పాటలు పాడారు. ఇందులో బాగాపాడిన వారు ఆదివారం నిర్వహించిన చివరి రౌండ్‌లో సింగిల్‌లో పాల్గొన్నారు. ఇందులో బాగా పాడినవారిని విజేతలుగా ప్రకటించి బహుమతులను అందచేశారు. మేళా అనే ఈవెంట్‌లో పాల్గొన్న విద్యార్థులు కొన్ని ఆటలను ఆడారు. వారి స్కోర్ ఆధారంగా విజేతలుగా ప్రకటించారు.

ప్రతిభకు కొలమానంగా ఈవెంట్లు

స్ప్రింగ్ స్ప్రీలో విద్యార్థులను విశేషంగా ఆకట్టుకోవడమే కాకుండా ఆలోచింప


నిట్ నుంచి తరలివెళ్తున్న విద్యార్థినులు

చేసిన ఈవెంట్ నుక్కడ్ నాటక్. వివిధ సామాజిక అంశాలను ఇతి వృత్తంగా ఎంచుకొని విద్యార్థులు వివిధ పాత్రలతో నటించిన ఈ ఈవెంట్ వాస్తవానికి ఒక వీధి నాటకం. కొరియో నైట్స్ ఈవెంట్ కూడా విద్యార్థుల ప్రశంసలను అందుకున్నది. స్ప్రింగ్‌స్ప్రీలో భాగంగా మూడురోజులు పాటు రాత్రిపొద్దుపోయిన తర్వాత ప్రదర్శించిన పాప్‌షోలు విద్యార్థులను ఉర్రూత లూగించాయి. శనివారం రాత్రి ప్రముఖ గాయకుడు నకాష్ అజీజ్ మ్యూజిక్ షోలో పాల్గొన్న విద్యార్థులు పాటలకు అనుగుణంగా చిందులేశారు. అంతకు ముందు రోజు చౌరస్తా బ్యాండ్, హరిచరణ్ బ్యాండ్ ప్రోప్‌షోలు కూడా విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ వేడుకలు విజయవంతం కావడంలో నిట్ కల్చర్ సొసైటీ, నిట్ డ్రామా అండ్ మ్యూజిక్ క్లబ్ విశేషంగా కృషి చేశాయి. కోఆర్డినేటర్లు చందర్, సాహిత్, తనీష్, ప్రశాంత్ నేతృత్వంలో వివిధ విద్యార్థి బృందాలు స్ప్రింగ్‌స్ప్రీ విజయవంతంలో తమ వంతు పాత్రను పోషించారు. స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ శ్రీనివాసాచార్య తన సహకారాన్ని అందించారు.

ఏకాంతంగా ఆలోచిస్తే జీవితంలో ఏమి కావాలో తెలుస్తుంది..

నిట్ స్ప్రింగ్ స్ప్రీలో విద్యార్థులతో హీరో నవదీప్

హనుమకొండ టౌన్, ఏప్రిల్7: ఏకాంతంగా ఆలోచనలు చేస్తే జీవితంలో మనకేమీ కావాలనేది దొరికిపోతుందని హీరో నవదీప్ విద్యార్థులకు సూచించారు. నిట్ స్ప్రింగ్‌స్ప్రీలో భాగంగా ఆదివారం కళాశాల ఆడిటోరియంలో విద్యార్థులతో నవదీప్ చిట్‌చాట్ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానమిచ్చారు. 18 ఏళ్ల వయస్సులోనే సినిమా అవకాశాలు రావడంతో వరుసగా సినిమాలు చేసుకుంటూ పోయానని, ఏ రోజు నాకు ఏమీ కావాలి.. అని ఆలోచన చేయలేదన్నారు. కరోనా సమయంలో జీవితంలో నాకేమి కావాలి అనే ఆలోచనలు మొదలైనప్పటి నుంచి జీవితంలో చాలా మార్పులు చోటు చేసుకున్నాయని, జీవితం గతంకన్నా బెటర్‌గా ముందుకెళుతోందన్నారు. సరిగ్గా ఆలోచన చేస్తే కావాల్సింది దొరుకుతుందని సూచించారు. ప్రతిభ ఎవరి సొత్తు కాదని, అవకాశాలు కోసం ఎక్కడా తిరగాల్సిన అవసరం లేదని, ఇంట్లో ఉండి యూట్యూబ్‌లో కంటెంట్ ఉన్న వీడియో అప్‌లోడ్ చేస్తే అవకాశం నిన్నే వెతుకుంటూ వస్తుందన్నారు. హీరో కాకపోతే ఏమి అయ్యేవారని విద్యార్థులు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ.. పక్కాగా ఉదయం 9 నుంచి 5 గంటల వరకు ఒకరి కిందనైతే పని చేసేవాడిని కాదన్నారు. తన ఫిట్‌నెస్‌కు వారంలో ఆరు రోజులు జిమ్ చేయడమే కారణమన్నారు. క్లాస్‌లో ఫస్ట్ బెంచా.. లాస్ట్ బెంచా.. అని విద్యార్థులు అడిగిన ప్రశ్నకు క్లాస్ అవుట్ స్టాండింగ్ స్టూడెంట్ అని క్లాస్ బయటనే ఉండేవాడినని ఫన్నీగా సమాధానమిచ్చి అందరినీ నవ్వించారు. సమయం దొరికినప్పుడు ట్రావెల్ చేస్తే కొత్త ప్రాంతాలు, వ్యక్తుల పరిచయం ద్వారా నాలెడ్జ్ పెంపొందించుకోవచ్చన్నారు. మీరు మెకానికల్ ఇంజనీరులైతే.. నేనే లైఫ్ ఇంజనీర్ అని విద్యారుంథల్లో ఆత్మస్థైర్యాన్ని నింపారు.


విద్యార్థులతో సెల్ఫీ దిగుతున్న హీరో నవదీప్

తన అభిమాన క్రికెటర్ ధోని, నటుడు చిర ంజీవి అని చెప్పుకొచ్చారు. కొన్ని సినిమాలు ప్లాప్ కావడానికి అవగహనలేని దర్శకులతో సినిమాలు ఒప్పుకోవడమే కారణమన్నారు. కాగా, విద్యార్థులతో జరిగిన చిట్‌చాట్‌లో పలు ప్రశ్నలకు సమాధానమిచ్చి వారిలో స్ఫూర్తి నింపారు. తన జీవితానికి దగ్గరగా ఉన్న కథతో నిర్మించిన లవ్ మౌలీ సినిమాలో హీరో గా నటించానని, ఈ నెల 19న విడుదల వుతుం దని, ప్రతి ఒక్కరూ ఆదరించాలని నవదీప్ కోరారు.

ఫిల్మ్ మేకింగ్‌లో చాలా ఒడిదొడుకులుంటాయి..

సీతారామం డైరెక్టర్ హను రాఘవపూడి

హనుమకొండ టౌన్, ఏప్రిల్7: ఫిల్మ్ మేకింగ్ అంటే చాలా ఒడిదొడుకులు ఉంటాయని సీతారామం చిత్ర దర్శకుడు హను రాఘవపూడి అన్నారు. మూడు రోజుల నిట్ స్ప్రింగ్ స్ప్రీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం నిట్‌లోని ఏఎల్‌సీ ఆడిటోరియంలో విద్యార్థులతో డైరెక్టర్ చిట్ చాట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 19 ఏళ్లకే చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టి చాలా అడ్డంకులను ఎదుర్కొన్నానన్నారు.



తన సినిమాల్లో విషాదకరమైన అంశాలు ఎక్కువ గా ఉండటానికి కారణం ప్రజలు సంతోషాలకన్నా విషాదకరమైన అంశాలే ఎక్కువగా గుర్తుంచుకోవడం వలన అన్నారు. సీతారామం షూటింగ్ సమయంలో కశ్మీర్‌లో ప్రతికూల వాతావరణంలో పనిచేయా ల్సి వచ్చిందన్నారు. డైరెక్టర్ కావాలంటే పుస్తక పఠనం బాగా చేయాలన్నారు. జాబ్ మీద ఆసక్తి లేక సినిమాల వైపు వచ్చానన్నారు. దర్శకుడు చంద్రశేఖర్ ఏలేటి వర్క్ స్టైల్‌ను ఇష్టపడుతానన్నారు.

మార్చేదెన్నడో..?!

ఆధార్ పోర్టల్‌లో అప్డేట్‌కాని జిల్లా పేరు

ఇంకా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే మహదేవపూర్ మండలం

పట్టించుకోని అధికారులు.. ఇబ్బందులు పడుతున్న ప్రజలు

మహదేవపూర్ రూరల్, ఏప్రిల్ 7 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఏర్పడి ఎనిమిది సంవత్సరాలు అవుతున్నాయి. ఆధార్ డేటాబేస్ మాత్రం ఇంకా అప్డేట్ కాలేదు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అప్పుడున్న మహదేవపూర్ మండలం ఇప్పటికీ అదే జిల్లా పేరుతో కొనసాగుతోంది. దీంతో పలు ప్రభుత్వ, ప్రైవేటు పనులకు మండల వాసులు ఇబ్బందులు పడుతున్నారు.

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఉన్న మహదేవపూర్, కాటారం, మహాముత్తారం, మల్హర్ ప్రస్తుతం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోకి మారాయి. నూతన జిల్లాలతోపాటు కొత్తగా ఏర్పడిన మండలాలను అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఉమ్మడి మహదేవపూర్ మండలం నుంచి మహదేవపూర్, పలిమెల రెండు మండలాలుగా విడిపోయాయి. అయితే నూతనంగా ఏర్పడిన పలిమెల మండలానికి ఆధార్ పోర్టల్‌లో జయశంకర్ భూపాలపల్లి జిల్లాగా వస్తుండగా మహదేవపూర్ మండలం మాత్రం ఇంకా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే కొనసాగుతోంది. పక్క మండలాలైన కాటారం, మహాముత్తారం, మల్హర్ మండలాలకు ఇదే పరిస్థితి ఎదురుకాగా సంవత్సరం క్రితమే ఆ మండలాలకు జయశంకర్ జిల్లా పేరు అప్డేట్ అయ్యింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 12 మండలాల్లో 11 మండలాలకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా పేరు ఆధార్ పోర్టల్‌లో అప్డేట్ కాగా ఒక్క మహదేవపూర్ మండలం మాత్రం ఇప్పటికీ ఉమ్మడి కరీంనగర్ జిల్లాగానే చూపిస్తోంది.

అప్డేట్‌కాక అవస్థలు

ఎన్నికల కమిషన్‌తో పాటు ఉపాధిహామీ, ఆసరా పింఛన్లు, రెవెన్యూ, కార్మిక శాఖలు, మీ-సేవలతో పాటు పలు ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులకు సంబంధించిన వెబ్‌సైట్లలో ఇప్పటికే జిల్లా పేరు అప్డేట్ అయి ఉండగా ఆధార్‌లో మాత్రం ఇంకా ఉమ్మడి కరీంనగర్ జిల్లా పేరుండటంతో పనులు కావడం లేదంటూ మండల వాసులు ఆందోళన చెందుతున్నారు. ఒక్క ఆధార్‌లో మాత్రమే జిల్లా పేరు వేరుగా ఉండటంతో పాస్‌పోర్టు వెరిఫికేషన్, దరఖాస్తు సైతం ఇబ్బందిగా మారిందని అంటున్నారు. ఈసమస్యపై ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక మండల వాసులు సతమతవుతున్నారు. హౌసింగ్, వెహికిల్ లోన్లు తీసుకునేవారితోపాటు పలు ఫైనాన్సు సంస్థలో లోన్ తీసుకునేవారికి పాత జిల్లా పేరు సమస్యగా మారడంతో ఆవేదనవ్యక్తమవుతోంది. ఈ క్రమంలోనే మహదేవపూర్ మండలం ఇంకా ఉమ్మడి జిల్లా పేరుతోనే కొనసాగుతోందని, వెంటనే నూతన జిల్లాపేరు ఆధార్ డేటాబేస్‌లో వచ్చేలా చూడాలని ఓ వ్యక్తి ఆన్‌లైన్ ద్వారా యూఐడీఏఐకి ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి స్పందన లేదు. యూఐడీఏఐ పోస్టల్ శాఖ పిన్‌కోడ్‌ల ఆధారంగానే జిల్లా పేర్లు మారుతాయని, పోస్టల్ శాఖ అధికారులు యూఐడీఏఐకి విజ్ఞప్తి చేస్తే ఆధార్ డేటాబేస్‌లో ఉమ్మడి జిల్లా పేరును తొలగించి జయశంకర్ జిల్లాపేరును యాడ్ చేసే అవకాశం ఉందని మరో వ్యక్తి చేసిన అర్జీకి యూఐడీఏఐ సంస్థ సమాధానం ఇచ్చినట్లు తెలిసింది.

పోస్టల్ శాఖ నిర్లక్ష్యం!

పోస్టల్ శాఖ నిర్లక్ష్యంతోనే ఆధార్ డేటాబేస్‌లో జిల్లా పేరు మారడం ఆలస్యమవుతోందనే టాక్ వినిపిస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆధార్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా పేరు తొలగించి ప్రస్తుత భూపాలపల్లి జిల్లా పేరును యాడ్ చేయాలని మండల వాసులు కోరుతున్నారు.

మతసామరస్యానికి ప్రతీక 'ఇఫ్తార్'



మహదేవపూర్‌లో ఇఫ్తార్ విందులో పాల్గొన్న మంత్రి శ్రీధర్‌బాబు



భూపాలపల్లి ఇఫ్తార్ విందులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర

మహదేవపూర్, ఏప్రిల్ 7: మత సామరస్యానికి ఇఫ్తార్ విందు ప్రతీక అని రాష్ట్ర ఐటీ, పారిశ్రామిక శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని కాంగ్రెస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జామా మసీదులో ఆదివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముస్లింలతో కలిసి ఇఫ్తార్ చేశారు. పలువురికి ఆయన స్వయంగా ఫలాహారాలు తినిపించారు. ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. రానున్న ఈదుల్ ఫితర్ (రంజాన్ పండుగ)ను ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ అరుణ, ఎంపీపీ రాణిబాయి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అక్బర్‌ఖాన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాపు తదితరులు పాల్గొన్నారు.

పేద ముస్లింలకు అండగా ఉంటా

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లిటౌన్ : పేద ముస్లిం కుటుంబాలకు అండగా ఉండి అన్ని విధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. భూపాలపల్లి జామా మసీదు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాంనర్సింహరెడ్డి, చల్లూరి మధు, బుర్ర కొంరయ్య, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

మంగపేట మండలంలో..

మంగపేట: మండలంలోని రాజుపేట, మంగపేట, కమలాపురం తదితర గ్రామాల్లో ఇఫ్తార్ విందులను నిర్వహించారు. ప్రభుత్వ ఉద్యోగి ఎమ్డీ మున్వర్‌ఖాన్, కమలాపురం కార్మిక నాయకుడు ఎమ్డీ. హుస్సేన్ ఆధ్వర్యంలో వేర్వేరుగా ఈ కార్యక్రమాలు జరిగాయి. ఆయా పార్టీల నాయకులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

క్రీడలతోపాటు చదువు ముఖ్యం

ఎమ్మెల్యే సత్యనారాయణరావు

చిట్యాల, ఏప్రిల్ 7: క్రీడలతోపాటు చదువు కూడా ముఖ్యమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. క్రీడల్లో రాణిస్తున్న వారు చదువును నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ ఆవరణలో జీఎస్సార్ చిట్యాల ప్రీమియర్ లీగ్ రెండో విడత క్రికెట్ పోటీల ట్రోఫీని ఎమ్మెల్యే ఆదివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. క్రీడా స్ఫూర్తిని ప్రదర్శిస్తూ ముందుకు సాగాల న్నారు. క్రీడలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని కమిటీకి సూచించారు. ఈకార్యక్రమంలో ఎంపీటీసీ దబ్బెట అనీల్, కోఆప్షన్ సభ్యుడు రాజ్‌మహ్మద్, నాయకులు రాంనర్సింహరెడ్డి, చిలుకల రాయకొంరు, దొడ్డి కిష్టయ్య, దబ్బెట రమేష్, బుర్ర శ్రీనివాస్, లక్ష్మణ్, అల్లం రాజు, బుర్ర మల్లేష్, ముసాహూరి నరేష్, నేరెళ్ల సమ్మయ్య, క్రీడా నిర్వహణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మహేందర్, అనీల్, సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుడి కుటుంబానికి రూ.10 లక్షలు ఇవ్వాలి

ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్యనారాయణ

భూపాలపల్లిటౌన్, ఏప్రిల్ 7: ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్న చేనేత కార్మికుడు సిరిపురం లక్ష్మీనారాయణ కుటుం బానికి ప్రభుత్వం రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని చేనేత ఐక్యవే దిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీమనాథుని సత్య నారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. ఆర్థిక ఇబ్బందులతో తన కుటుం బాన్ని ఎలా పోషించుకోవాలో తెలియక మనోవేదనకు గురై లక్ష్మీనారాయణ ఆత్మహత్య చేసుకు న్నాడని అన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చేనేత కార్మికులను ఆదుకోవాలని, అలాగే మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అంచాలని అన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి అడిషనల్ కలెక్టర్ పూజలు



హేమాచల క్షేత్రంలో అడిషనల్ కలెక్టర్ దంపతులు

మంగపేట, ఏప్రిల్ 7: మండలంలోని మల్లూరు హేమాచల క్షేత్రంలో వెలిసి యున్న ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనర్సిం హస్వామిని వరంగల్ అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి కుటుంబ సమేతంగా ఆదివారం సందర్శించారు. ఆదిలక్ష్మి, చెంచు లక్ష్మి అమ్మవార్లను దర్శించుకొని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ దంపతులను స్వామివారి శేష వస్త్రాలతో అర్చకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు కైంకైర్యం రాఘావాచార్యులు, ముక్కమల్ల రాజశేఖరశర్మ, అర్చకులు ఈశ్వర్‌చంద్‌శర్మ, పవన్‌కుమారాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

మేడారంలో ఆగని ప్లాస్టిక్ వినియోగం



ప్లాస్టిక్ కవర్లులో కొబ్బరికాయలు, బెల్లం వేసి అమ్ముతున్న వ్యాపారులు

మేడారం, ఏప్రిల్ 7: తాడ్వాయి మండలం మేడారంలో ప్లాస్టిక్ వినియోగం యథేచ్ఛగా కొనసాగుతోంది. మేడారం సమ్మక్క సారలమ్మలను దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి తరలి వస్తున్న భక్తులు, వ్యాపారులు ప్లాస్టిక్‌ను విచ్చలవిడిగా వాడుతున్నారని స్థానికులు అంటున్నారు. గద్దెల పరిసరాల్లో అధికారులు ప్లాస్టిక్ నియంత్రణపై అవగాహన కల్పిస్తూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు నిబంధన ఉల్లంఘనపై అధికారులు దృష్టి సారించడం లేదని అంటున్నారు.

క్లిక్ చేస్తే ఖాతా ఖతం!

ఆదమరిస్తే బ్యాంకు అకౌంట్ ఖాళీ

ఎన్నికల వేళ ఘరానా మోసాలు

వెంకటాపూర్(రామప్ప), ఏప్రిల్ 7: సాంకేతికరంగం కొత్త పుంతలు తొక్కుతున్న కొద్దీ నేరస్వరూపం మారిపోతూ ఉంది. ప్రజలను మోసం చేయడానికి సైబర్ నేరస్థులు రోజుకో కొత్త మార్గాన్ని ఎంచుకుంటున్నారు. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పథకాల పేరుతో అమాయకులకు టోకరా వేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని సోషల్ మీడియాలో లింకులు పంపుతున్నారు. వాటిని ఓపెన్ చేసి వివరాలు నమోదు చేయాలని సూచిస్తున్నారు. అలా ఆ లికులు ఓపెన్ చేయగానే బ్యాంకు ఖాతాలోని నగదును మాయమ్మె తున్నాయి. ఇలా సైబర్ నేరగాళ్ల మోసాలకు పాల్పడుతున్నారు. ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్, ఆన్‌లైన్ గేమ్స్, తదితర లింకులను పోస్ట్‌చేసి సామాజిక మాధ్యమాల్లో బురిడీ కొట్టిస్తున్నారు. అది ప్రభుత్వ వెబ్‌సైట్‌లాగా ఉండడంతో చాలామంది నమ్మి మోసపోతున్నారు. ఆయా పథకాల కోసం దరఖాస్తు చేసుకోవడానికి వివరాలు నమోదు చేయగానే బ్యాంకు ఖాతా నుంచి క్షణాల్లో డబ్బులు కట్ అవుతున్నాయి. తీరా మోసపోయామని తెలిసిన బాధితులు లబోదిబోమంటున్నారు. ఈ నేపథ్యంలో సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. అనవసరమైన లింకులు ఓపెన్ చేయొద్దని హెచ్చరికలు జారీ చేశారు.

అప్రమత్తంగా ఉండాలి : చల్ల రాజు, ఎస్సై



స్మార్ట్‌ఫోన్‌లకు వచ్చే ప్రకటనల పట్ల అప్రమత్తంగా ఉండాలి. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడితే పోలీసులకు సమాచారం వెంటనే అందించాలి. లేదంటే సైబర్‌క్రైమ్ పోలీసులకు సమాచారం ఇవ్వాలి. 24గంటల లోపు పోలీసులకు సమాచారం అందిస్తే డబ్బులు పోకుండా చర్యలు తీసుకుంటాం.

అశ్రునయనాల మధ్య మావోయిస్ట్ నేత అంత్యక్రియలు

(3వ పేజీ తరువాయి)

కమిటీ సభ్యుడు, సీఆర్‌సీ-2 కమాండర్ స్థాయికి ఎదిగి ఎన్‌కౌంటర్‌లో అసువులుబాయడంతో అంతిమయాత్రకు పలు ప్రాంతాల నుంచి విప్లవకారులు, సామాన్య జనం బారులుతీరారు. ఉద్యమ కళాకారులు, మాజీ మావోయిస్టులు చంద్రన్న, తాతన్న తదితరులు, అమరవీరుల బంధుమిత్రుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శాంతక్క, సభ్యులు సత్యవతి, నవత, మహేందర్, శంకర్, పౌరహక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా నేతలు రవి, వినోద్, ప్రజాఫ్రంట్ రాష్ట్ర నేత కొమురయ్య, విరసం నేత బాలసాని రాజయ్య హాజరయ్యారు. విప్లవ గేయాలు ఆలపిస్తూ అంత్యక్రియల్లో పాల్గొన్నారు. పలువురు కళాకారులు సంతోష్ వీరత్వం, ప్రజల కోసం పాటుపడిన తీరుపై పాటలు పాడారు. ఉద్యమనేతలు, మాజీ మావోయిస్టులు సంతోష్ గొప్పతనాన్ని వివరిస్తూ కంటతడిపెట్టారు. బట్టలో చుట్టిన మృతదేహాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన బంధుమిత్రుల కమిటీ ప్రతినిధులు, ఉద్యమకళాకారులు పోలీసులు సంతోష్ తదితరులను పట్టుకుని చిత్రహింసలకు గురిచేసి చంపి ఎన్‌కౌంటర్‌గా కట్టుకథలు అల్లారని ఆరోపించారు.

మఫ్టీలో పోలీసుల నిఘా

సంతోష్ మృతదేహం దస్తగిరిపల్లికి చేరకముందు నుంచే పోలీసులు మఫ్టీలో నిఘా పెట్టారు. మృతదేహం గ్రామంలో వచ్చినప్పటి నుంచి అంత్యక్రియలు ముగిసే వరకు క్షుణ్ణంగా పరిశీలించారు. గ్రామానికి ఎవరెవరు వస్తున్నారు.. ఏమేం మాట్లాడుతున్నారు..? అనే విషయాలను ఆరా తీశారు. సివిల్, ఎస్‌బీ, ఇంటిలిజెన్స్, ఎస్ఐబీ తదితర విభాగాల పోలీస్ అధికారులు, సిబ్బంది సంతోష్ అంతిమయాత్రలో జనంలో కలిసిపయి ఇక్కడ చోటుచేసుకున్న పరిణామాలను ఎప్పటికప్పుడు తమ ఉన్నతాధికారులకు నివేదించినట్లు తెలుస్తోంది.

కాటారంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

కాటారం, ఏప్రిల్ 7: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, పలు గ్రామాల్లోని వెల్‌నెస్ సెంటర్లలో ఆదివారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రజలతో యోగాసనాలు వేయించి ఆరోగ్యం కోసం పాటించాల్సిన సూత్రాలు, జాగ్రత్తలు తెలిపారు. రోగులకు అరటి పండ్లు పంపిణీ చేశారు. బీపీ, షుగర్ రోగులకు మందులను అందించారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

నర్సరీలో మొక్కల రక్షణకు చర్యలు

మొగుళ్లపల్లి, ఏప్రిల్ 7: హరితహారం కార్యక్రమంలో భాగంగా గ్రామపంచాయతీలో ఏర్పాటుచేసిన నర్సరీలోని మొక్కలను ఎండ తీవ్రత నుంచి కాపాడేందుకు అధికారులు రక్షణ చర్యలు చేపట్టారు. నర్సరీలో గ్రీన్‌షెడ్ నెట్లు ఏర్పాటు చేస్తున్నారు. తొమ్మిదో విడత హరితహారం కార్యక్రమంలో మండలంలోని 25గ్రామపంచాయతీల్లో 2లక్షల 50వేల మొక్కలు నాటడానికి అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. ఫిబ్రవరి చివరి నుంచి ఎండల తీవ్రత రోజురోజుకూ పెరగడంతో నర్సరీలలోని మొక్కలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. దీంతో అధికారుల ఆదేశంతో సిబ్బంది, కూలీలు నర్సరీలలోని మొక్కలను కాపాడేందుకు గ్రీన్‌షెడ్‌నెట్ ఏర్పాటుచేసి ఎప్పటికప్పుడు నీటిని పడుతున్నారు.

చెరువు నుంచి అక్రమంగా మట్టి తవ్వకాలు



ఏటూరునాగారం, ఏప్రిల్ 7 : ఏటూరునాగారం మండలం శంకరాజుపల్లి గ్రామ శివారు చెరువు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఆదివారం మధ్యాహ్నం ఎక్సావేటర్ సాయంతో మట్టి తవ్వకాలు చేపట్టారు. పెద్ద ఎత్తున ట్రాక్టర్లు ద్వారా మట్టిని అక్రమంగా తరలిస్తూ విక్రయాలు జరుపుతూ సొమ్ము చేసుకుంటున్నారు. ట్రాక్టర్ నడిపే డ్రైవర్లు మైనర్లు కావడం వారికి ఎలాంటి డ్రైవింగ్ లైసెన్స్ లేకపోవడంతో పాటు పట్టపగలే చెరువులో తవ్వకాలు జరిపి మట్టిని తరలిస్తూ అందిన కాడికి దోచుకుంటున్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ జగదీశ్వర్ ఆదేశాల మేరకు మట్టిని తరలిస్తున్న ప్రదేశానికి రెవెన్యూ అధికారులు వెళ్లారు. వారితో ఎక్సావేటర్, ట్రాక్టర్లు యజమానులు వాగ్వాదానికి దిగి విధులకు ఆటంకం కలిగించారు. దీంతో వారిపై అధికారులు పోలీసులకు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

ములుగు జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి



మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాగజ్యోతి

మంగపేట, ఏప్రిల్ 7: బీఆర్ఎస్‌ను గ్రామస్థాయిలో బలోపేతం చేసిన కార్యకర్తలను కష్ట, సుఖాల్లో ఆదుకొని అండదండలు అందిస్తామని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి అన్నారు. మండలంలోని చుంచుపల్లికి చెందిన బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి బోడ శ్రీను ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై వైద్యం పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి కుటుంబాన్ని నాగజ్యోతి పరామర్శించారు. శ్రీను మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. అనంతరం పలు గ్రామాల్లో నాగజ్యోతి పర్యటించి బీఆర్ఎస్ కార్యకర్తలను కలిశారు. అధైర్యపడొద్దని, అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆమె వెంట బీఆర్ఎస్ నాయకులు చల్లగురుగుల తిరుపతి, నిమ్మగడ్డ ప్రవీణ్, రాజమల్ల సుకుమార్, కర్రి శ్రీను, మోదుగు బాబు, గుడివాడ శ్రీహరి, గందం కిషోర్, పూజారి రాజు, మూగల రాము, రమేష్ తదితరులు ఉన్నారు.

నిరుపయోగంగా అటవీ శాఖ భవనాలు

- శిథిలావస్థలో డీఆర్వో కార్యాలయం, ఎఫ్‌బీవో క్వార్టర్



నిరుపయోగంగా ఉన్న ఎఫ్‌బీవో క్వార్టర్

కాటారం, ఏప్రిల్ 7:లక్షలాది రూపాయల నిధులు వెచ్చించి నిర్మించిన భవనాలు నిరుపయోగంగా మారాయి. ఉపయోగించకుండా అలాగే వదిలేయడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. మండలంలోని చింతకానిలో అటవీశాఖ డిప్యూటీ రేంజర్ కార్యాలయం, బీట్ ఆఫీసర్ క్వార్టర్ నిరుపయోగంగా పడి ఉన్నాయి. సుమారు రూ.20 లక్షలకు పైగా నిధులతో 2013లో కార్యాలయాలకు భవనాలు నిర్మించారు. రేంజ్‌గా ఉన్న కార్యాలయంలో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది 2016 వరకు విధులు నిర్వర్తించారు. జిల్లాల పునర్విభజన క్రమంలో అటవీ శాఖలోనూ రేంజ్‌ల పునర్విభజన చోటు చేసుకుంది. గతంలో చింతకాని పేరిట రేంజ్ కార్యాలయం ఉండగా కాటారం రేంజ్‌ను ఏర్పాటు చేశారు. దీంతో రేంజర్, ఇతర సిబ్బంది కాటారానికి తరలివెళ్లడంతో భవనం మూతపడింది. అలాగే ఫారెస్ట్ బీట్ అధికారి క్వార్టర్ భవనం నిర్మించిన అనంతరం ప్రారంభించారు. ప్రారంభించిన నాటి నుంచి రెండు మూడు నెలలు మినహా ఎనిమిదేళ్లుగా అందులో ఎవరు ఉండకపోవడంతో శిథిలావస్థకు చేరింది. కార్యాలయం చుట్టు పిచ్చిమొక్కలు, గడ్డి పెరిగి బూత్ బంగ్లాను తలపిస్తున్నది. లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన భవనాలు నిరుపయోగంగా మారడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. భవనాల్లో రాత్రిపూట అసాంఘిక కార్యకలాపాలు చోటు చేసుకుంటున్నాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. భవనాలను ఉపయోగంలోకి తెచ్చి గ్రామపంచాయతీకైనా అప్పజెప్పాలని కోరుతున్నారు. అటవీ శాఖ ఉన్నతాధికారులు స్పందించి భవనాలను, కార్యాలయాల స్థలాలను పరిరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

మహారాష్ట్రలో ముగ్గురు మావోయిస్టుల అరెస్టు

మహదేవపూర్, ఏప్రిల్ 7: తెలంగాణా సరిహద్దుల్లో మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో ముగ్గురు మావోయిస్టులను అరెస్టు చేశారు. ఆ జిల్లా ఎస్పీ నీలోత్పల్ ఆదివారం ఈ విషయాన్ని వెల్లడించారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో మహారాష్ట్రకు చెందిన సీ-60 దళాలతోపాటు సీఆర్‌పీఎఫ్ దళాలు అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేస్తుండగా పిప్లి బుర్గి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మౌజా జవేలీ అటవీ ప్రాంతంలో మావోయిస్టుల సంచారం ఉన్నట్లు సమాచారం అందింది. ఏటపల్లి తాలూకా కచ్చులూర్‌కు చెందిన కాజల్ అలియాస్ సింధూ, రమన్‌టోలాకు చెందిన గీతా అలియాస్ సుక్లీలు ఉన్నట్లు సమాచారం రావడంతో వారిని చుట్టు ముట్టి అదుపులోకి తీసుకున్నారు. వీరిద్దరిపై రూ. 2 లక్షల చొప్పున రివార్డు ఉన్నట్లు ఎస్పీ। వివరించారు. వీరిపై అనేక కేసులు ఉన్నట్లు ఆయన వివరించారు. వీసా పండు నరోటే అనే మరో మావోయిస్టును సైతం అరెస్టు చేసినట్లు ఆయన వివరించారు. అతడిపై రూ. 1.5 లక్షల రివార్డు ఉన్నట్లు వివరించారు. వ ఈ సమావేశంలో ఏఎస్పీ (ఆపరేషన్స్) యతీష్ దేశ్‌ముఖ్, ఏఎస్పీ (అడ్మిన్) చింతా కుమార్, అహెరీ ఏఎస్పీ రమేష్, సిఆర్‌పిఎఫ్, సీ60 దళాలకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.

పునరావాస కాలనీని పరిశీలించిన అడిషనల్ కలెక్టర్



రైతులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్

మల్హర్, ఏప్రిల్ 7 : జెన్‌కో భూ ఉపరితల బొగ్గుగనుల తవ్వకాల్లో భాగంగా తాడిచర్ల ఎస్సీకాలనీ, కాపురం గ్రామంలోని ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు కేటాయించిన పునరావాస కాలనీని అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆదివారం సందర్శించారు. కాపురం నిర్వాసితులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. కాపురం గ్రామంలో మిగిలిన లబ్ధిదారులకు పునరావాసం కల్పించడానికి భూమిని పరిశీలించారు. రైతులు భూములు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నది లేనిది అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం తాడిచర్లలో కాపురం, తాడిచర్ల ఎస్సీకాలనీ వాసులకు కేటాయించిన స్థలం సమీపంలోనే మిగిలిన వారికి పునరావాసం కల్పించడానికి ఎనిమిదెకరాలు అవసరం కాగా భూమిని పరిశీ లించి రైతుల తమ అభిప్రాయాన్ని తెలపాలని కోరారు. దీనికి రైతులు కొంత సమయం అడిగారు. ఆయన వెంట ఆర్డీవో లాల్‌నాయక్, తహసీల్దార్ రవికుమార్, ఏఎమ్మార్ పీఆర్వో మల్లేష్ ఉన్నారు.

ముమ్మరంగా కూంబింగ్

ఎన్‌కౌంటర్ నేపథ్యంలో పోలీసుల హైఅలర్ట్

మహదేవపూర్ రూరల్, ఏప్రిల్ 7 : తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతంలో శనివారం జరిగిన ఎన్‌కౌంటర్ నేపథ్యంలో పోలీసులు కూంబింగ్ ముమ్మరం చేశారు. భూపాలపల్లి జిల్లాకు చెందిన మావోయిస్టు అన్నె సంతోష్ మృతి చెందడంతో పోలీసులు మరింత అప్రమత్తం అయ్యారు. పలిమెల మండలానికి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సరిహద్దుగా ఉండటంతో మావోయిస్టులు తమ ఉనికికి చాటుకునేందుకు ప్రయత్నిస్తారనే అనుమానంతో భద్రతను కట్టుదిట్టం చేస్తున్నారు. పోలీసు బలగాలు పలిమెల అటవీ ప్రాంతంలోని గోదావరి తీరం వెంబడి విస్తృతంగా కూంబింగ్ చేపట్టినట్లు తెలుస్తోంది.

తెలంగాణకు-ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల మధ్య గోదావరి సరిహద్దు ఉండటం, నదిలో సైతం ప్రవాహం తక్కువగా ఉండటంతో ఏక్షణాన్నైనా జిల్లాలోకి మావోయిస్టులు చొరబడే అవకాశం ఉందని భావిస్తూ పోలీసులు అడవుల్లో జల్లెడ పడుతున్నట్టు తెలుస్తోంది. అయితే పలిమెల మండలం పూర్తిగా అటవీ ప్రాంతం కావడంతో ఏక్షణం ఏం జరుగుతుందోనని మండల వాసులు ఆందోళన చెందుతున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

మంగపేట, ఏప్రిల్ 7: మండలంలోని కమలాపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. శ్రీ హేమాచల లక్ష్మీనరసింహస్వామి రైతుమిత్ర ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ఇన్‌చార్జి ఎ.శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. రైతులు నేరుగా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తరలించి మద్దతు ధర పొందాలని సూచించారు.